# టైగర్

విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, నటరత్న, పద్మశ్రీ ఎన్.టి. రామారావుగారు, తను స్థాపించిన తెలుగుదేశం పార్టీ తరపున, గుంటూరుజిల్లా పర్యటనలో భాగంగా మాచెర్లవచ్చారు. నాగార్జునసాగర్‌లో ఆగి సందేశం ఇవ్వవలసిందిగా ఇక్కడ ప్రముఖులు, అభిమానులు కోరితే అంగీకరించారు.

ఇంతకీ చెప్పేదేమిటంటే మాబాబుకి ఎన్టీ ఆర్. అంటే చాలా ఇష్టం. ఆయన సినిమాలు తప్పక చూస్తాడు. ఇంటికి వచ్చి సినిమాలో ఆయన స్టంట్ చేసినట్లుగా నాతోచేసి నన్ను ఇబ్బంది పెడుతుంటాడు. ఆయన ఫోటో పత్రికలలో చూసి "టైగర్" అని చెబుతుంటాడు. అలా చెప్పేటప్పుడు వాడి ముఖం చేటంత అవుతుంది. ఇంతకీ మావాడి వయసెంత అని అడగండి, చదివేది మూడవ తరగతి, అక్షరాలా ఏడు సంవత్సరాలు.

"నాన్నగారు" ఎన్ టి ఆర్ కి దండవేస్తాను అన్నాడు "అలాగే నాన్నా" అన్నాను. ఆరోజు ఉదయమే లేచి ఇక్కడ కాలనీలో తిరిగి ఉన్న రకరకాల పూలు సేకరించి వాళ్ళమ్మచేత బ్రహ్మాండమైన దండ చేయించాడు.

వాయుగుండం ప్రభావంచేత ఆరోజు ఉదయం నుండి వానకురుస్తుంది. అయినా సాగర్‌లో జన ప్రవాహాన్ని ఆపడం కష్టంగానే వుంది- ఆయన వచ్చారు. ఎలాగో ఒక పెద్ద మనిషిని పట్టుకుని మా బాబుతో, "ఎన్టీ ఆర్" దగ్గరకు చేరుకున్నాము.

"ఎన్టీఆర్ శుద్ధ ఖద్దరు బట్టలతో వున్నారు. పైన పొందూరు ఖద్దరు సిల్కు కండువా, గులాబీరంగులో వుండే ఆయన ముఖారవిందం పర్యటనలమూలాన వాడిపోయినట్టుంది.

ఆయన ముఖంలో దివ్యతేజస్సు అవతార పురుషునిలా ఉన్నా రాయన. సినిమాల్లో పిల్ల హీరోయిన్లతో కుప్పిగంతులు వేసేది ఈయనేనా? అనిపించింది నాకు. ఆయన కళ్ళల్లో స్థిరనిశ్చయం, ఏదోచేయాలనే తపన, హాయిగా సినిమాల్లో రాజబోగాలు అనుభవించక ఎందుకండీ మీకు ఇదంతా చెప్పాలనిపించింది నాకు.

"నాన్నగారూ నేను దండ వెయ్యను ఈయన ఎన్టీఆర్ కాదు, అన్నాడు మాబాబు.

కాదు నాన్నా ఈయనే ఎన్టీఆర్, సినిమాల్లో వేషాలేస్తే అలా వుంటారు, అని ఏదో చెబుతున్నాను.

అబ్బ అదేంకాదు. ఈయన టైగరు కేడీనెంబరు వన్, సూపరు మెన్, బొబ్బిలిపులిలోలా లేడుగా ఈయన ఎన్టీఆర్ కాదు అని ముఖం ముడుచుకున్నాడు.

ఇంక నేను చెప్పేదేముంది
నేనే ఆదండ వేసేను.

—o—

# "సితార"

సితారగారు మీకు "రంభ" ఎవార్డ్ వచ్చినపుడు ఎలా ఫీలయ్యారు? ప్రఖ్యాత నటి సితారకు అంతర్జాతీయ ఎవార్డ్ "రంభ" వచ్చిన సందర్భం లో ఒక విలేఖరి ఈ ప్రశ్నతో ప్రారంభించాడు సమావేశం.

సితార వయ్యారంగా కుర్చీలోంచి కదిలి "నేను నా మాతృభాష కన్నడంలో ఎన్ని సినిమాలు నటించినా నాకు ఎవార్డ్ రాలేదు. కానీ తెలుగు చిత్రంలో ఈ ఎవార్డు వచ్చినందుకు నా సంతోషం మీకు మాటల్లో చెప్ప లేను" అంది ఆమె మాతృభాషలో

మరో ప్రశ్న మీరు నటనలో ఇంతటి పరాకాష్టకు చేరుకోడానికి మీకు ప్రేరణ ఎవరు?"